



వీసీ మురళీకృష్ణతో నాన్‌టీచింగ్ సిబ్బంది

మెట్టపై విచారణ.. జరిగేనా?



రామేశంమెట్ట లే అవుట్ (ఫైల్)

- రామేశంమెట్టపై నిరుపయోగంగా జగనన్న లేఅవుట్ ఇళ్ల స్థలాలు
- ఏళ్లు గడిచినా ఇంటి పునాది వేయని లబ్ధిదారులు
- 59 ఎకరాల్లో 2,114మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించిన నాటి వైసీపీ ప్రభుత్వం
- అడ్డగోలుగా గ్రావెల్ తవ్వి అగాధాల్లా మార్చేసిన గ్రావెల్ మాఫియా
- ఆ స్థలాల్లోకి వెళ్లేందుకు లబ్ధిదారులు ఆనాడే విముఖత
- అయినా చదును పేరుతో రూ.కోట్ల నిధులు వృథా చేసిన వైసీపీ నేతలు
- కనీస సదుపాయాలు కూడా కరువే
- గ్రావెల్ తవ్వి కోట్లు కొల్లగొట్టిన సూత్రధారులపై విచారణ జరిగేనా?
- కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్న లబ్ధిదారులు

పెద్దాపురం పట్టణ శివారులో ఉన్న రామేశంమెట్ట 823 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇక్కడ ఉన్న లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ మాఫియా అక్రమంగా తరలించేసింది. ప్రస్తుతం అక్కడి పరిస్థితి చూస్తుంటే అగాధాలను తలపిస్తూ భయభ్రాంతులకు గురయ్యేటట్టు కనిపిస్తోంది. ఇటువంటి ప్రదేశంలో ఇళ్ల స్థలాలు వద్దని లబ్ధిదారులు ఎంత మొత్తుకున్న గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ నిర్మాణం చేపట్టింది. 59ఎకరాల్లో 2,114మంది లబ్ధిదారులకు ఆనాడు ఇళ్లస్థలాలను కేటాయించేశారు. లబ్ధిదారులకు స్థలాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకూ అక్కడ ఒక్క ఇల్లు కూడా ఎవరూ కట్టుకోలేదు. అక్కడ ఇల్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఎవరూ కూడా ముందుకు రాలేదు.

పెద్దాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పట్టణ శివారులోని రామేశంమెట్టలో పేదలకు ఇళ్లస్థలాలను కేటాయించిన తర్వాత కూడా అక్కడ గ్రావెల్ తవ్వకాలు ఆగలేదు. ఆనాటి వైసీపీ నాయకులు అండదండలతో అక్రమార్కులు ఇబ్బడిముబ్బడిగా తరలించుకుపోయారు. 20 అడుగుల మేర తవ్వకాలు సాగించడంతో ఆ ప్రదేశం ప్రస్తుతం లోయలను తలపిస్తోంది. ఆ లేవుట్ వద్దకు వెళ్లి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే సాహసం చేయలేకపోతున్నారు. అధికారులు ఈ లే అవుట్ వైపు అసలు కన్నెత్తి చూసిన పాపానపోలేదు.

అగాధాలు దాటి వెళ్లాలంటేనే వణుకే..

గత వైసీపీ ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు కార్యక్రమాన్ని నవరత్నాలు పేరుతో అట్టహాసంగా ప్రారంభించింది. పెద్దా పురం మండలం విషయానికి వస్తే 3965మంది లబ్ధిదారులను ఆనాడు గుర్తించారు. వీరిలో కొంతమందికి స్థానికంగా స్థలాలు పంపిణీ చేశారు. రామే శంమెట్ట వద్ద మాత్రం పులిమేరు, గుడివాడ, సిరివాడ, కాండ్రకోట, ఉలిమేశ్వరం, చదలాడ, గోరింట, దివిలి, చంద్ర మాంపల్లి తాటిపర్తి తదితర గ్రామాలకు ఇళ్లస్థలాలను ఇక్కడ కేటాయించారు. గ్రావెల్ తవ్వేసిన ప్రదేశంలో 59 ఎకరాల్లో ఈలే అవుట్ వేశారు. లబ్ధిదారులు నివాసం ఉన్న ప్రదేశం నుంచి 11 కిలోమీటర్ల దూరంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల ఇవ్వడంతో లబ్ధిదారులు ఆనాడే అంత దూరంలో తమకు స్థలాలను కేటాయిస్తారా అని లబ్ధిదారులు లబోదిబోమన్నారు. ఆ ప్రాం తంలో తమకు ఇళ్ల స్థలాలు వద్దని లబ్ధిదారులు ఎంత మొత్తుకున్నా వినిపించుకోకుండా అక్కడే స్థలాలను కేటాయించేశారు.

చదును పేరుతో కోట్లు మేసేసి..

రామేశంమెట్ట లేఅవుట్‌ను కొందరు అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. లేఅవుట్ అభివృద్ధి చేసేందుకు చదును పేరుతో రూ.కోట్లు నిధులు మింగేశారు. 59ఎకరాల ప్రాంతాన్ని చదును చేయాల్సి ఉందని ఇందుకోసం రూ.2కోట్ల వరకూ ఖర్చు అవుతుందని అంచనావేశారు. ఈ మేరకు చదును పేరుతో రూ.కోటి పైబడి బిల్లులు చేసుకుని సర్దేసుకున్నారు. తవ్వేసిన ఈ భూముల్లో లే అవుట్ అభివృద్ధి పేరుతో అప్పటి వైసీపీ నేతలు రూ.కోట్లు దారి మళ్లించినట్లు పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరగాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం జగనన్న లేఅవుట్లలో జరిగిన అక్రమాలపై దృష్టి సారించింది. దానిలో భాగంగానే దీనిపై కూడా విచారణ జరపాలని పలు ప్రజా సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంలో ఎమ్మెల్యే కూడా చొరవ తీసుకుని దీనిపై సమగ్ర విచారణ జరిపించే విధంగా చర్యలను తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లబ్ధిదారుల నుంచి ఆనాడే వ్యతిరేకత..

రామేశంమెట్ట భూములను కేటాయించడంపై లబ్ధిదారులనుంచి ఆనాడే వైసీపీ నేతలకు వ్యతిరేకత ఎదురైంది. లబ్ధిదారులు తమకు ఎటువంటి ఉపయోగం లేని స్థలాలు కట్టబెట్టారని అధికారులు, వైసీపీ నేతలపై అప్పట్లో ఆగ్రహంతో ఊగిపోయారు. స్థలాలు కేటాయించే సమయంలో తమకు అంత దూరంలో స్థలాలు వద్దని ఆందోళన కార్యక్రమాలను సైతం నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

పేదలందరికీ ఇళ్లు పేరుతో ఆనాడు స్థలాలు పొందిన లబ్ధిదారులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తమకు అన్యాయం జరిగిందని, సుదూరప్రాంతంలో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించారని గగ్గోలు పెడుతున్నారు. బలవంతంగా తమకు ఎందుకు పనికిరాని స్థలాలను ఆనాడు వైసీపీ ప్రభుత్వం కేటయించిందని, కూటమి ప్రభుత్వంలో తమకు వేరేచోట ఇళ్ల స్థలాలను కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎంఎస్ ఆఫీస్‌పై ముగిసిన శిక్షణ

- జేఎన్‌టీయూకేలో నాన్ టీచింగ్ సిబ్బందికి రెండురోజులపాటు శిక్షణ కార్యక్రమం

జేఎన్టీయూకే, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకేలో ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో యూసీఈకే భవనంలోని పీజీ రీసెర్చ్ ల్యాబ్‌లో రెండురోజులపాటు నాన్‌టీచింగ్ సిబ్బందికి ఎంఎస్ ఆఫీస్‌పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ఆదివారం ముగిసింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ మాట్లాడుతూ మనలో నైపుణ్యాలుంటే మనకు ఎవరూ సరిరారన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు కశ్యప్, రఘురాం, వెంకట్ నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకార్యక్రమం సోమవారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలోను..

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన తెలిపారు. నగరపాలక సంస్థ సమావేశమందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్ తదుపరి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

భారీగా వనసమారాధనలు 8



కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని శుభం కాపు కల్యాణ మండపంలో కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాపు కార్తీక వనసమారాధనలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు జ్ఞాపిక అందిస్తున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ నేత వాసిరెడ్డి ఏసుదాసు

జనసంద్రంగా కాకినాడ బీచ్

- కార్తీకమాసం.. మూడో ఆదివారం కాకినాడ సూర్యారావుపేట బీచ్‌కు సందర్శకుల తాకిడి


సర్పవరం జంక్షన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓ వైపు హోరెత్తించే సముద్ర అలల విన్యాసాలు.. మరోవైపు సముద్ర కెరటాలపై నుంచి చల్లని గాలులను సందర్శకులు ఆస్వాదించారు. కార్తీకమాసంలో మూడో ఆదివారం కావడంతో కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌కు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. దీంతో కాకినాడ సాగరతీరం జన సందోహంతో నిండిపోయింది. యువత ఆటపాటలు, కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు గుర్రం ఎక్కి స్వారీ చేస్తూ ఉల్లాసంగా గడిపారు. యువతీ, యువకులు సముద్రస్నానాలు ఆచరిస్తూ సముద్రతీరంలో బైక్‌లపై విన్యాసాలతో కనువిందు చేశారు. పర్యాటకులు మొబైల్ ఫాస్ట్‌ఫుడ్, తిను బండారాల దుకాణాలవద్ద చిరుతిళ్లు తింటూ సరదాగా గడిపారు. బీచ్‌కి సందర్శకుల రద్దీ అధికంగా ఉండడంతో కాకినాడ మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ మధు సిబ్బందితో కలిసి పర్యాటకులను అప్రమత్తం చేస్తూ తీరంలో పటిష్ఠ గస్తీ నిర్వహించారు.



సాగరతీరంలో సముద్ర స్నానాలు ఆచరిస్తూ కోలాహలంగా ఉన్న సందర్శకులు

ఉప్పాడ బీచ్‌లో...

కొత్తపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):ఉప్పాడ బీచ్‌లోను పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. పిల్లలతో వచ్చిన పర్యాటకులు బీచ్‌రోడ్డులో పెద్దవంతెన సమీపంలో అప్రోచ్‌రోడ్డు వంతెన పాయలో కేరింతలు కొట్టారు. సముద్రంలో కెరటాలు ఉధృతంగా ఉండడంతో కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు.



కబ్జాదారులపై.. కఠినంగానే..

- భూ కబ్జాదారులకు కఠిన శిక్షలకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం
- తప్పించుకోకుండా పకడ్బందీ చట్టం
- శిక్షతోపాటు ఆస్తుల సీజ్‌కు ప్రణాళిక
- బాధితులకు నష్టపరిహారం దిశగా చర్యలు
- భూ కబ్జా కేసుల కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కోర్టులు
- ఇప్పటికే అసెంబ్లీలో ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ బిల్లు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారులకు కఠిన శిక్షలకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. భూకబ్జాదారులు తప్పించుకోకుండా పగడ్బందీ చట్టాలు తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కబ్జాదారులకు శిక్షతో పాటు ఆస్తులు కూడా సీజ్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. బాధితులకు నష్టపరిహారం దిశగా చర్యలు తీసుకోనుంది. అందుకోసం భూకబ్జాకోసం జిల్లాస్థాయిలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం కూడా ఉంది. ఇదే జరిగితే ల్యాండ్ మాఫియాను ఉక్కుపాదంతో అణిచివేసేందుకు ప్రభుత్వం పగడ్బందీ చట్టాన్ని తీసుకొస్తున్నట్లే. అర్థబలం, అంగబలంతో రెచ్చిపోయిన ల్యాండ్ మాఫియా కట్టడే లక్ష్యంగా సామాన్యుల ఆస్తులకు రక్షణ కవచంలాగా నూతన ఆక్రమణల నిషేధిత చట్టాన్ని ప్రభుత్వం తీసుకురానుంది. ఇప్పటికే దీనికి సంబంధించి ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ బిల్లును అంసెబ్లీలో ఈనెల 14న ప్రవేశపెట్టారు.

గత ప్రభుత్వంలో యథేచ్ఛగా..

కాకినాడ జిల్లాలో ల్యాండ్ మాఫియాకు సంబంధించి అక్రమార్కులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పలుకుబడితోపాటు పోలీసులను గుప్పెట్లో పెట్టుకుని యథేచ్ఛగా తమ కార్యకలాపాలను కొనసాగించేవారు. ఎవరైనా వీరి అక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై తప్పుడు కేసులతో వేధింపుకు గురిచేసేవారు. కోర్టులకు వెళ్తే ఎన్నేళ్లకు కేసు తేలుతుందో అర్థం కాక కొందరు కోర్టులకు వెళ్లలేక మరికొందరు, కోట్ల ఖరీదైన ఆస్తులను వదులుకోలేక ఇంకొందరు న్యాయపోరాటం చేయలేక సతమతమవుతూ వచ్చారు. ఎవరైనా వారిని ధీటుగా ఎదుర్కొని పోలీసులకు ఫిర్యాదు చేసినా చట్టంలో ఉన్న లొసుగులను అడ్డుపెట్టుకుని స్టేషన్ బెయిల్‌పై వచ్చి మరీ భూ యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తూ తమ భూకబ్జాల పర్వం కొనసాగిస్తూ వచ్చారు.

ఆరు నెలల్లోనే విచారణ

అమాయకులు, వృద్ధులు, ఎన్ఆర్ఐల భూములపై కన్నేసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి డబుల్ రిజిస్ట్రేషన్ చేసి వివాదం సృష్టిస్తే కోర్టుల చుట్టూ తిరగలేక వారే దారికి వస్తారులే అని ఇప్పటివరకు భావించిన భూకబ్జాదారుల ఆటలు ఇక సాగవు. కొత్తగా వస్తున్న ఈ చట్టం ప్రకారం ఏ వివాదమైనా ఆరు నెలల్లో విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇంతకుముందు మాదిరిగా కేసు కొట్టేయడం కాదు. భూమి ఆక్రమించినట్లు తేలితే నిందితుడిపై కఠిన చర్యలు ఉండనున్నాయి. నిందితుడికి కనీసం 10 నుంచి 14 ఏళ్లకు తక్కువ కాకుండా జైలు శిక్ష విధించనున్నారు. ఆక్రమించిన భూమి విలువతోపాటు మూడు రెట్ల వరకు నిందితుడి నుంచి నష్టపరిహారం వసూలు చేయనున్నారు. ఇందుకుగాను ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కోర్టుల్లో కేవలం భూకబ్జా కేసులు మాత్రమే విచారించనున్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఆయా కోర్టులే నేరుగా సుమోటోగా కేసులు విచారణ చేపట్టే అధికారాలు కూడా కల్పించనున్నారు. భూకబ్జాలకు పాల్పడే మాఫియాకు ఏమాత్రం అవకాశం, లొసుగులకు ఆస్కారం లేకుండా నూతన చట్టాన్ని తీసుకురాబోతున్నారు.

చేయూత మార్ట్‌లో గోల్‌మాల్!



- తాళ్లరేవు మండలం కోరింగలో వీవోఏలు, వెలుగు అధికారుల మాయాజాలం
- రూ.లక్షల్లో ప్రజాధనం స్వాహా.. మార్ట్‌లో నిలిచిన లావాదేవీలు
- నిధుల గల్లంతుపై మత్స్యకార మహిళల ఫిర్యాదులు

తాళ్లరేవు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కోరింగ చేయూత మార్ట్‌లో డ్వాక్రా సంఘాల సభ్యుల పెట్టుబడులు గోల్‌మాల్ అయినట్టు ఆరోపణలు వస్తున్నాయి. మార్ట్‌లో నిత్యావసర సరుకులు లేకపోవడంతో కొనుగోలు, విక్రయాల లావాదేవీలు నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా రూ.83లక్షలతో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌లోని సరుకును వెలుగు అధికారులు, వీవోఏలు పక్కదారి పట్టించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల నిధులను పెట్టుబడిగా పెట్టి మహిళా చేయూత మార్ట్ ఏర్పాటు చేసి ఏడాదికి కోటి రూపాయలు లాభాలు వచ్చాయని ఎంతో ఆర్భాటంగా సంబరాలు జరపగా ప్రభుత్వం మారిన వెంటనే మూసివేత దిశగా అడుగులు వేస్తున్నారు. మార్ట్ మేనేజర్, ఓటీలు, వర్కర్లను ఎక్కడికక్కడే సర్దేయగా ఇద్దరు వర్కర్లతో మాత్రమే మార్ట్ నడిపిస్తున్నారు.

ప్రతి గ్రూపు నుంచి వసూలు

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో కోరింగ చేయూత మార్ట్ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. 2000 డ్వాక్రా సంఘాల్లో ఒక్కో సభ్యురాలి నుంచి రూ.200 చొప్పున డ్వాక్రా సంఘానికి రూ.2000 చొప్పున రూ.47లక్షలను వసూళ్ల చేశారు. గోదావరి మహా సమాఖ్య నుంచి మరో రూ.35లక్షలు అప్పుగా తీసుకుని మార్ట్‌ను వినూత్నంగా తీర్చిదిద్దారు. ఈ ప్రాంతంలో బిర్యానీ పాయింట్ హోటల్ నిర్వహణ బయట వ్యక్తికి ఇచ్చి గోదావరి మహాసమాఖ్యకు నెలకు రూ.60వేలు అద్దె చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. బాలయోగి కళ్యాణమండపంలో మహిళా మార్ట్ నిర్వహణకు స్థానిక పంచాయతీకి నెలకు రూ.25వేలు అద్దె చెల్లించేలా తీర్మానం చేశారు. ప్రతినెలా మార్ట్‌లో వచ్చే లాభాలను డ్వాక్రా సంఘాల గ్రూపు సభ్యుల ఖాతాలకు జమచేస్తామని సభ్యులను నమ్మబలికారు. ఈ వ్యవహారంలో యానిమేటర్లు భారీ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లాభాలు ఏమైనట్టు..

మార్ట్ నిర్వాహకులు పెట్టుబడులను, లాభాలను దారి మళ్లించడంతో మార్ట్ నష్టాల్లో కూరుకుపోయినట్లు తెలుస్తోంది. వీవోఏలు సభ్యుల ప్రమేయం లేకుండా ఇష్టానుసారంగా తీర్మానాలు చేసి సభ్యుల పొదుపు ఖాతాలనుంచి మహిళా మార్ట్ బ్యాంక్ ఖాతాకు డబ్బులను మళ్లించేసినట్టు తెలుస్తోంది. తర్వాత కూడా మార్ట్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయకుంటే బ్యాంకు రుణాలను నిలిపివేస్తామని, డ్వాక్రా సంఘాల నుంచి సభ్యులను తొలగించేస్తామని బెదిరించినట్టు సభ్యులు ఆరోపిస్తున్నారు. మార్ట్‌లో వచ్చిన లాభాలను సభ్యుల ఖాతాలకు ఒక్క పైసా కూడా జమ చేయలేదని, ఈ నిధులు ఏమయ్యాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. మార్టులో ప్రస్తుతం రూ.2లక్షల విలువ చేసే సరుకులు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది.

లీగల్ నోటీసులు.. ఫిర్యాదులు

మార్ట్‌లో నిధుల గోల్‌మాల్‌పై మత్స్యకార మహిళలైన పెమ్మాడి కృష్ణవేణి, కామాడి కృష్ణజ్యోతి, పినపోతు భవాని, పెనుపోతుల ధనలక్ష్మి, కోలా వరలక్ష్మి కలిసి మండల మహిళా సమాఖ్య, వెలుగు అధికారులు ఏపీఎం సన్యాసిరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మహాలక్ష్మి, వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ ఆఫీసర్ బాబురాజారావ్‌లకు లీగల్ నోటీసులను పంపించారు. దీంతో మార్ట్ వ్యవహారం బహిర్గతమైంది. సంఘాలనుంచి తీసుకున్న నిధులను తిరిగి ఆయా సంఘాలకు చెల్లించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఆర్‌డీఏ పీడీ, సాంఘిక సంక్షేమశాఖ మేనేజర్, కాకినాడ ఆర్డీవో, తాళ్లరేవు ఎంపీడీవో, తహసీల్దార్‌లకు మత్స్యకార మహిళలు ఫిర్యాదులు చేశారు. వెలుగు అధికారులు మార్ట్‌లో పదిరోజులుగా లెక్కలను తారుమారుచేస్తూ రికార్డులు సర్దేసి డ్వాక్రా సంఘాలకు అప్పులు చూపిస్తున్నట్లు తెలుస్తోంది.

సత్యదేవుడి సన్నిధి.. భక్తజనసంద్రం 7

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల విజేత ఉమ్మడి 'తూర్పు' బాలికల జట్టు 7

మున్సిపల్ పాఠశాల ఘటనపై విచారణ అధికారిని నియమించాం : డీఈవో 7

సత్యదేవుడి సన్నిధి.. భక్తజనసంద్రం



అన్నవరంలో స్వామివారి దర్శనంకోసం క్యూలైన్‌లో వేచియున్న భక్తులు


అన్నవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పర్వదినాలు ముగింపు దశకు చేరనుండడంతో సత్యదేవుడి సన్నిధిలో రద్దీ క్రమేపీ పెరుగుతుంది. ఆదివారం సెలవుదినం కావడంతో స్వామివారి సన్నిధి భక్తజన సంద్రమైంది. ఆదివారం ఒక్కరోజు 8893 వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా రూ.90లక్షల ఆదాయం సమకూరింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు గంటలనుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించినా ఉదయం 9గంటల నుంచి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఈవో రామచంద్రమోహన్ క్యూలైన్‌ల వద్ద నుంచి త్వరితగతిన భక్తులు దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. సత్యదేవా నిత్యాన్నదాన పథకం ద్వారా 30వేలమందికి ఉచిత పులిహోర దద్దోజన ప్రసాదం వితరణ చేశారు. 80వేలమంది స్వామిని దర్శించుకున్నారు.

- ఒక్కరోజే 8893 వ్రతాలు
- రూ.90 లక్షల ఆదాయం

నేడు, రేపు రద్దీ

కార్తీక చివరి సోమవారం, మంగళవారం బహుళ ఏకాదశి పర్వదనం కావడంతో ఈ రెండు రోజులు స్వామివారి ఆలయంలో రద్దీకొనసాగనుంది. దీనికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై దృష్టిసారించారు.

తెరచాటు సూరీడు..



ఎత్తైన కొండల నడుమ నల్లటి మబ్బుల మధ్యలో ఎర్రటి సూరీడు అస్తమించే ఈ సుందర దృశ్యం కట్టిపడేస్తోంది కదూ.. సత్యదేవుడి గిరిప్రదక్షిణ మార్గంలో ఆవిష్కృతమైన ఈ చిత్రం ప్రకృతి ప్రేమికులను రంజింపచేస్తోంది. దీన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది. అన్నవరం/(ఆంధ్రజ్యోతి)

పలు రైళ్ల రద్దు

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో తాడి-దువ్వాడ రైల్వే సెక్షన్‌లో చేపడుతున్న నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా విజయవాడ నుంచి సామర్లకోట జంక్షన్ మీదుగా విశాఖకు రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వేఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి నుంచి ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

- 12717 నెంబరుగల విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే రైలును ఈనెల 25న రద్దు చేశారు.
- 12718 నెంబరు గల విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే రైలును ఈనెల 25న రద్దు చేశారు.
- 17267 నెంబరు గల కాకినాడ-విశాఖపట్నం, 17268 నెంబరుగల విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే రైళ్లను ఈనెల 25న రద్దు చేశారు.
- 17239, 17240 నెంబర్లుగల గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు 25న రద్దు చేశారు.
- 17267, 17268 నెంబర్లు గల కాకినాడ పోర్టు-విశాఖ-కాకినాడ పోర్టు మధ్య రాకపోకలు సాగించే పాస్ట్ పాసింజర్లు 25న రద్దు చేశారు.
- 07466, 07467 నెంబర్లు గల రాజమహేంద్రవరం-విశాఖ-రాజమహేంద్రవరం మధ్య రాకపోకలు సాగించే పాసింజర్ రైళ్లు 25న రద్దు చేశారు.

ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా తమ ప్రయాణాలను కొనసాగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

గండి పోశమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

దేవీపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండల పరిధిలో ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారి దర్శనాలు ఇటీవల అధికారులు పునః ప్రారంభించడంతో ఆదివారం వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం కావడంతో అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ పెరిగింది.



భక్తులకు దర్శనమిస్తున్న గండిపోశమ్మ తల్లి

ఉత్కంఠభరితంగా ఉమ్మడి జిల్లా బాస్కెట్ పోటీలు

పిఠాపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని పిఠాపురంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పురుషులు, మహిళల చాంపియన్‌షిప్ పోటీలు రెండు రోజులుగా ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం, రాత్రి కూడా ఈ పోటీలు జరిగాయి. మహిళలు, పురుషుల జట్లు సెమీఫైనల్‌కి చేరాయి. అర్ధరాత్రి వరకూ ఈ పోటీలు జరిగ్గా ఈ పోటీలను క్రీడాకారులు, స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల విజేత 'తూర్పు'

కాకినాడ అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి); రెండురోజులుగా కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి రగ్బీపోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. పోటీల్లో విజేతగా ఉమ్మడి జిల్లా బాలికల జట్టు నిలిచింది. గుంటూరు రెండోస్థానం దక్కించుకోగా ప్రకాశం మూడోస్థానం నిలిచింది. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి అధ్యక్షతన జరిగిన సభలో విజేతలకు మెమెంటోలు అందజేశారు. వివిధ జిల్లాలనుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబరులో రాంచిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు జార్జి తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, పరిశీలకుడు గణేష్, నాగేంద్రకుమార్, రమణరాజు, వి.రవి రాజు, కె.నూకరాజు, సునీల్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బాలికల రగ్బీ పోటీల్లో విజేతగా నిలిచిన తూర్పు జట్టు

కోటసత్తెమ్మకు పూజలు



నిడదవోలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి విశేష దర్శనం, నిత్యదర్శనం చేపట్టారు. అమ్మవారికి క్షీర నివేదన, మహానివేదన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



రుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బీవీఆర్ చౌదరితో కుటుంబీకులు, వెంకటరమణచౌదరిని అభినందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, దాట్ల సుబ్బరాజు

రుడా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- రానున్న 40 ఏళ్లు దృష్టిలో పెట్టుకుని చేస్తా
- గత అక్రమాలపై దృష్టిపెడతా
- రుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారంలో బొడ్డు వెంకట రమణ చౌదరి



బీవీఆర్ చౌదరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న 40ఏళ్లలో రాజమహేంద్రవరం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించడమే నా ప్రధాన లక్ష్యమని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి కళ్యాణ మండపంలో ఆది వారం రుడా చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. తొలుత బొడ్డు వెంకటరమణ చౌదరి తండ్రి బొడ్డు భాస్కరరామారావు చిత్రపటానికి పూలమాల వేసి బొడ్డు కుటుంబీకులు తల్లి జగన్నేహిని, సతీమణి సురేఖ, ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. అనంతరం వెంకటరమణచౌదరి మా ట్లాడుతూ నాకు రుడా చైర్మన్ పదవి ఇచ్చిన సీ ఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాజానగరం టీడీపీ శ్రేణులవల్లనే తనకు ఈ పదవి వచ్చిందన్నారు. అభివృద్ధిలో సమప్రాధాన్యం ఇస్తామన్నారు. రాజమహేంద్రవరం నగరం వేగంగా అభివృద్ధి చెందు తూ ఉన్నతంగా ఉండాలన్నారు. ఇందులో తమవంతు పాత్ర పోషిస్తామన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటికే అధికారులతో సమాలోచన చేస్తున్నామన్నారు. రుడా పరంగా కొత్త ప్రాజెక్టులు వస్తాయన్నారు. రుడా నుంచి అభివృద్ధి వైపు కార్యకలాపాలు నిర్వహిస్తూనే మరోవైపు గత పాలకుల అవినీతి అక్రమాలపై దృష్టిపెడతామన్నారు. అందరి సహకారం సమన్వయంతో ముందుకు సాగుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి సౌమ్యులని కానీ గత పాలకుల లెక్కలు తేలుస్తారని చెప్పారు. కూటమిలో చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నప్పటికీ తామంతా చంద్రబాబుకోసం రాష్ట్ర శ్రేయస్సు కోసం తగ్గి కలిసికట్టుగా వెళతామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ హాజరై అభినందనలు తెలిపారు. తొలుత బొడ్డుకు ఆదిరెడ్డి వాసు పెయింటింగ్ బహూకరించారు. తొలుత బొడ్డు వెంకటరమణచౌదరి రాజానగరం నియోజకవర్గం నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. రూరల్ గ్రామాల గుండా రాజమహేంద్రవరం చేరుకున్నారు. బొడ్డుకు ఆయా గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. అనంతరం భారీ సాయిలో చెరుకూరి కళ్యాణ మండపానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిరాజు, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి పీతల సుజాత, టీడీపీ సీనియర్ నేత గన్నికృష్ణ, నీరుకొండ వీరన్నచౌదరి, మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన రాజమహేంద్రవరం ఇన్ చార్జి అనుశ్రీ సత్యనారాయణ, పరిమి వాసు, ఇతర ముఖ్యనాయకులు బొడ్డుకు అభినందనలు తెలిపారు.

కార్మిక నాయకుడు గల్లా రాము మృతి



అమలాపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురానికి చెందిన కార్మిక నాయకుడు గల్లా రాము(83) ఆదివారం మృతి చెందారు. ఆది నుంచి కార్మిక ఉద్యమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అభిమానిగా ముద్ర వేసుకున్న రాము పార్టీ ఆవిర్భావం సమయంలో అమలాపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఎన్టీఆర్ కోరగా ఆయన సున్నితంగా తిరస్కరించారు. అప్పటికే పేరొందిన దూలం నాగేశ్వరరావు పేరును రాము సూచించారు. నాగేశ్వరరావు కూడా తిరస్కరించడంతో 1983లో మెట్ల సత్యనారాయణ టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. టీడీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా ఆయన రెండు దశాబ్దాలు పనిచేశారు. అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి సిఫార్సుతో రైల్వే యూజర్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. రాముకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విచారణ అధికారిని నియమించాం : డీఈవో

కాకినాడరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురం అన్నమ్మ ఘాటీ జీఎంసీ బాలయోగి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై విచారణ అధికారిని నియమించినట్లు డీఈవో రమేష్ తెలిపారు. విచారణ అనంతరం నివేదిక అందిన వెంటనే ఆ ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

శోభాయమానంగా ద్రాక్షారామ భీమేశ్వరాలయం

- రేపు 61వ కార్తీకదీపారాధన మహోత్సవం



సప్తగోదావరినది మధ్యలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి భారీ కటౌట్, సెట్టింగ్

ద్రాక్షారామ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకదీపారాధన మహోత్సవానికి ద్రాక్షారామ శోభాయమానంగా ముస్తాబు అయింది. ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయ బాలభక్తసమాజం ఆధ్వర్యంలో రేపు 61వ కార్తీక దీపారాధన మహోత్సవం జరుగనుంది. కార్తీక మాసం ఆఖరు మంగళవారం భీమేశ్వరస్వామివారి ఆలయబాహ్య ప్రాంగణంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయంవద్ద కార్తీకదీపారాధన వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. 61వ కార్తీకదీపారాధనకు ఏర్పాట్లు పూర్తి చేశారు.ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్య ప్రాంగణం, సప్తగోదావరి నదిఒడ్డున, బోసుబొమ్మసెంటర్‌లో మిరుమిట్లు గొలిపే విద్యుత్, ఎల్ఈడీ దీపాల సెట్టింగ్‌లతో అలంకరించారు. సప్తగోదావరినది మధ్యలో ఆంజనేయస్వామిభారీ కటౌట్ ఏర్పాటుచేశారు. సాంస్కృతిక కార్యక్రమాల వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మంగళవారం ఉదయం 6 గంటలకు ప్రసన్నాంజనేయస్వామికి విశేష లక్షతులసి పూజ, పంచామృత అభిషేకం నిర్వహిస్తారు. రాష్ట్ర కార్మికశాఖ, పరిశ్రమలుశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు పూజాధికాల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఉష్ణవాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. రాజ్యసభసభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ నగరోత్సవం ప్రారంభిస్తారు. 4నుంచి 5 గంటల వరకు అక్కిరెడ్డి అబ్బు బృందంచే భజన కాలక్షేపం జరుగుతుంది. సాయంత్రం 5.24 గంటలకు అఖండ దీపారాధనను ప్రసన్నాంజేయస్వామి బాలభక్త సమాజం గౌరశాధ్యక్షుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు ప్రారంభిస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

తదుపరి శుభమ్ ఈవెంట్స్‌చే సినీ గాయకులు శ్రీలలిత, సత్య, సిద్ధూరాక్‌స్టార్‌లచే సినీ సంగీత విభావరి జరుగుతుంది. జబర్దస్త్ బృందం రైజింగ్‌రాజు, దొరబాబు, హరిత, రాజమౌళిచే హాస్య సన్నివేశాలు ప్రదర్శన నిర్వహిస్తారు. అనంతరం దవులూరి శ్రీనివాస్‌చే బాణాసంచా కాల్పులు ఉంటాయి. తదుపరి ఉమాశ్రీవాణి కళానికేతన్ వారిచే రామాంజనేయ యుద్ధం వార్‌సీను, రాజనర్తకి నాటకం జరుగుతాయి. రామచంద్రపురం డీఎస్పీ పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక దర్శనం క్యూలైనులో భక్తులు

భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఆఖరు కార్తీక ఆదివారం భక్తులరద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. క్యూలైన్ల ద్వారా భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉసిరిక వృక్షంవద్ద కార్తీకదీపాలు వెలిగించారు. సామూహిక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అన్నదాన భవనంలో అన్నదానం నిర్వహించారు. పైండావారి సత్రంలో యథావిధిగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ పర్యవేక్షణలో భక్తులకు సేవలు అందించారు. ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాపికొండలకు 12 బోట్లు

దేవీపట్నం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది పాపికొండలు అందాలు తిలకించేందుకు తరలివచ్చారు. మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరివాహక ప్రాంతాలమీదుగా ప్రకృతి ప్రేమికులు 12బోట్లలో 850మంది పర్యాటకులు పాపికొండలు మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. రెండు గంటలపాటు పాపికొండల్లో సందడి చేశారు. అనంతరం సాయంత్రం 5గంటలకు పోశమ్మగండి చేరుకున్నారు. భారీగా పర్యాటకులు హాజరుకావడంతో సందడి నెలకొంది. ముందుగా గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని పాపికొండలు వెళ్లారు.



పాపికొండలకు వెళుతున్న బోటు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.చిరంజీవినీకుమారి

సాహిత్యానికి అనుబంధం కథ

- డాక్టర్ పి.చిరంజీవినీకుమారి

కాకినాడరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కథ అనేది చరిత్రకు, జీవితానికి, సాహిత్యానికి అనుబంధం వంటిదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి అన్నారు. ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కథ ఏమిటి ఎందుకు ఎలా అనే అంశంపై ఒక సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. సభాధ్యక్షురాలు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మాట్లాడుతూ మనిషి పుట్టగానే కథ వచ్చింది, బాలసాహిత్యం నుంచి అద్భుత కథలు వచ్చాయన్నారు. అనంతరం నందూరి రాజగోపాల్ మాట్లాడుతూ పెద్దల నుంచి విన్నదే కథ అని, అది జీవితంలో ఒక భాగం అయిందని పేర్కొన్నారు. అనంతరం వాడ్రేవు వీరలక్ష్మి, మహమ్మద్ ఖదీర్‌బాబు ప్రసంగించారు. మణిబాబు, వీరబాబు, సత్యనారాయణ, వెంకటనరసింహశాస్త్రి, శైలజ, చింతపల్లి సుబ్బారావు, స్టీవెన్‌రాజు పాల్గొన్నారు.

చంటిబిడ్డ మృతిపై బంధువుల ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నందం గనిరాజు సెంటర్ సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చంటిబిడ్డ మృతి చెందిన సంఘటనపై బాధిత బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే ఏలేశ్వరం పెద్దవీధికి చెందిన బండి లక్ష్మణ్ భార్య డెలివరీ నిమిత్తం అక్టోబరు 30న ఆసుపత్రిలో చేరింది. ఆమెకు కవల పిల్లలు పుట్టారు. ఇద్దరిలో ఒక పాపకు ఆరోగ్యం బాగోలేదని.. అప్పట్నుంచి ఎన్ఐసీయూలో పెట్టి చికిత్స అందిస్తున్నారు. అయితే శనివారం రాత్రి బేబి మృతి చెందిందని వైద్యులు చెప్పడంతో లక్ష్మణ్ ఆవేదనతో ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగాడు. తమవల్ల కాదు అంటే వేరొక హాస్పటల్‌కు పాపను తీసుకువెళ్లి చికిత్స చేయించుకునేవారమని.. చెప్పకుండా చంపేశారని ఆసుపత్రి వర్గాల తీరుపై మండిపడ్డారు. అటుపై బేబి మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న చంటిబిడ్డ బంధువులు

సామర్లకోటలో లక్షపత్రి పూజలు

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఆదివారం సామర్లకోట చంద్రశేఖరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజల్లో 12 దంపతులు ఆశీనులయ్యారు. వైశ్య సంఘాల ప్రతినిధులు కుసుమంచి శేషగిరి రావుపావని దంపతులు, కతకం సతీష్ దంప తులు బోనగిరి సాంబమూర్తి, కంచర్ల నాగేశ్వరరావు భాగ్యలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

అసలే ఇరుకు... ఆపై నిర్మాణాలు!

పెద్దాపురం బస్టాండ్ ఆవరణలో వాణిజ్య సముదాయాల నిర్మాణాలు
మున్సిపాలిటీ నుంచి ముందస్తు అనుమతులు నిల్
నిర్మాణం పూర్తయితే ప్రమాదాలు జరిగే అవకాశం


బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం

పెద్దాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అది నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం.. పైగా అక్కడే బస్టాండ్, మున్సిపల్ వాణిజ్య భవన సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో వందలాదిగా వాహనాల రాకపోకలతో పాటు నిత్యం ప్రజలు రద్దీగా తిరుగుతుంటారు. అటువంటి ప్రదేశంలో అనధికారికంగా మరో వాణిజ్య సముదాయాన్ని నిర్మించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో వాణిజ్య భవన సముదాయాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంతం మరింత రద్దీగా మారడంతో పాటు పలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సమీపంలోనే విద్యుత్ ట్రాన్సఫార్మర్ ఉండడంతో పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రదేశంలో వాణిజ్య సముదాయల నిర్మాణం చేపడితే అనుకోని ప్రమాదం ఏదైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతం ఇప్పటికే ఇరుకుగా ఉండడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. వాణిజ్య సముదాయాల నిర్మాణం జరిగితే మరింత ఇబ్బంది కలిగే అవకాశం ఉందని, పైగా పలు ప్రమాదాలు జరుగుతాయనిప్రజలు ఆగ్రహం చెందుతున్నారు.

పట్టణంలో చర్చనీయాంశంగా...

ఇదిలా ఉండగా వాణిజ్య సముదాయల నిర్మాణాలకు సంబంధించి ముందస్తుగా మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా అవేమీలేకుండానే నిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలను చేపట్టడంతో పట్టణంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పైగా మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య సముదాయల నిర్మాణం జరిగితే బస్టాండ్‌కి వచ్చేవారికి పార్కింగ్ చేసుకునే ప్రదేశం కూడా తగ్గిపోతుందని, అలాగే బస్సులు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు చెబుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతిని వివరణ కోరగా వాణిజ్య సముదాయాల నిర్మాణానికి ఆర్టీసీ అధికారులు ఎటువంటి అనుమతులు తీసుకోలేదని, అలాగే పలువురు కౌన్సిలర్లు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని, దీంతో ఆర్టీసీ అధికారులకు లేఖ కూడా రాయడం జరిగిందన్నారు. ఆర్టీసీ కాకినాడ డీఎం మనోహర్‌ను వివరణ కోరగా ఆర్టీసీకి చెందిన స్థలాన్ని 15 ఏళ్ల కమర్షియల్ డవలప్‌మెంట్ కోసం లీజుకు ఇవ్వడం జరిగిందని, తాత్కాలిక నిర్మాణాలు మాత్రమే చేపట్టనున్నట్టు తెలిపారు.

టీడీపీ కోసం పని చేసేవారికి గుర్తింపు

మాజీ ఎమ్మెల్యే వర్మ


సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఆదివారం పిఠాపురం టీడీపీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. రానున్న నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అలాగే టీడీపీ సభ్యత్వాలు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం 15వేలు పూర్తయ్యిందని, మరింత పెంచాలన్నారు. వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ నియమితులైన బర్ల అప్పారావును సత్కరించారు. ఆయన పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. సకుమళ్ల గంగాధర్, బర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇండస్ట్రీస్ స్పోర్ట్స్‌మీట్

సామర్లకోట, నవంబరు 24(ఆంధ్ర జ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇండస్ట్రీస్ స్పోర్ట్స్‌మీట్ 2024 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ముగింపు పోటీలు నిర్వహించారు. క్రికెట్‌లో విన్నర్స్‌గా రాక్ సిరామిక్ సంస్థకు చెందిన కార్మికులు విజయం సాధించారు. రన్నర్స్‌గా అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ నిలిచింది. షటిల్ బ్యాడ్మింటన్‌లో డబుల్స్ విన్నర్స్‌గా రాక్ సిరామిక్, రన్నర్స్‌గా నెక్కంటి సీఫుడ్స్, సింగిల్స్ విన్నర్స్‌గా పట్టాభి ఆగ్రోఫుడ్స్, రన్నర్స్‌గా గిరిజా అల్లాయ్, పవర్ కార్మికులు నిలిచారు. విజేతలకు పరిశ్రమల యాజమాన్యాలకు మహారాణీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, కరస్పాండెంట్ జాస్తి రమేష్, ఫిజిక్స్ హెచ్‌వోడీ ఏ. సత్యనారాయణమూర్తి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. క్రీడా పోటీల నిర్వహణకు మైదానాన్ని సమకూర్చిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిర్మయి, కరస్పాండెంట్ రమేష్‌లను పరిశ్రమల యాజమాన్యాలు సత్కరించారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు నీరజ్ కుమార్, డాక్టర్ వివివి. శేషగిరిరావు, వినోద్, చెల్లదురై, పీ.బాలాజీ, వీజీఎస్.కుమార్, రవీంద్రనాధ్, సత్యనారాయణ, అనిల్, శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రవి, సురేష్, ఎస్.రావు, గోపీచంద్, అత్యుత్, గాంధీ, ప్రసాద్, మణికంఠ, రవీంద్ర, లక్ష్మణ్, కృష్ణ పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ

సర్పవరం జంక్షన్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): సినీ డైరెక్టర్ కురసాల కల్యాణ్‌కృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం వైద్యనగర్‌లో మాజీ ఎమ్మెల్యే కన్నబాబు నివాసం వద్ద కురసాల కల్యాణ్‌కృష్ణ యూత్ ధోని శ్రీనివాస్, కర్రి చక్రధర్‌ల ఆధ్వర్యంలో డైరెక్టర్ కల్యాణ్‌కృష్ణతో కేకు కోయించి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం రమణయ్యపేట, ఇందిరా కాలనీ, తూరంగి, నడకుదురు తదితర వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు చీరలు, దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు మోకా కృష్ణంరాజు, ముద్రగడ నాయుడు, సిద్దా శివాజీ, గొడతా సూర్యప్రకాశ్, తర్లపు మణికంఠ, పవన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో నూతనవిద్యుత్ లైన్ల నిర్మాణం, వివిధ విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీరు ఏవీఎస్‌డీఎస్. ప్రభాకర్ ఆదివారం రాత్రి తెలిపారు. పట్టణంలోని కోటపేట, పాత ఎమ్మార్వో కార్యాలయం, కొత్తపేట, పెద్దబజార్, బలుసులపేట, సంత మార్కెట్, పెన్షన్ లైన్, సీఎంసీ హాస్పిటల్, ఇందిరా కాలనీ, నీలమ్మ చెరువు, ఇస్మాయిల్ నగర్, కుమ్మరవీధి, సంగీతరావుపేట, మెహెర్ కాంప్లెక్స్, పెద్ద పోస్టాఫీసు ప్రాంతాలకు అంతరాయం కలుగుతుందని ఈఈ పేర్కొన్నారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కాల భైరవ అష్టకంతో ప్రత్యేక పూజలు చేపట్టి అనంతరం ఆలయ ఆవరణంలో కార్తీక దీపాలతో కాల భైరవ అలంకారాలు చేశారు. భక్తులతో దత్తు, వీరబాబు సోదరులు ప్రత్యేక పూజలు చేయించారు.

ద్విచక్రవాహనాలు ఢీ కొని వ్యక్తికి తీవ్రగాయాలు

తాళ్లరేవు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలేకుర్రు రహదారిలో 2ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైనట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. పోలేకుర్రు మెరకప్రాంతానికి చెందిన పుప్పాల శ్రావణకుమార్ ద్విచక్ర వాహనంపై పి.మల్లవరం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా తాళ్లరేవు నుంచి ద్విచక్రవాహనంపై తోటపేట గ్రామానికి చెందిన కొంకే సాయిసిద్ధార్థ, ముడికి మనోజ్ వేగంగా వచ్చి ఎదురుగా ఉన్న ద్విక్రవాహనాన్ని ఢీకొనడంతో శ్రావణకుమార్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోరింగ ఎస్ఐ తెలిపారు.

ఘనంగా వన సమారాధనలు


కాకినాడ రూరల్: వనసమారాధనలో మాట్లాడుతున్న గొట్టిపాటి సత్యవాణి


పెద్దాపురంలో కాపు వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సర్పవరం జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో గల శుభం కాపు కల్యాణ మండపంలో కాపు కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పెద్దాపురం, కొత్తపేట ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఉభయ గోదావరి జిల్లాల టీడీపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, రంబాల వెంకటేశ్వరరావు, కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం పళ్లంరాజు, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాపుసద్భావన సంఘం ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. చిన్నారులు, మహిళలకు నిర్వహించిన పలు పోటీల్లో రాణించిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వీవై దాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాశ్, ఆర్.సీతయ్యదొర తదితర సభ్యులు ఉన్నారు.

పిఠాపురంలో...

పిఠాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో కాపు కార్తీక వన సమారాధన సందడిగా జరిగింది. మాధవపురం రోడ్డులోని పంతం వారి తోటలో నియోజకవర్గ స్థాయి వన సమారాధన ఆటల పోటీలు, నృత్య ప్రదర్శనలు, ఉపన్యాసాలతో సందడిగా సాగింది. వన భోజనాల్లో అందరూ కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, దేవరపల్లి చిన్నబాబు, చెల్లుబోయిన సతీష్, సూరవరపు సురేష్, మురాలశెట్టి సునీల్ కుమార్, బుర్రా అనుబాబు, మార్నీడి రంగబాబు, కొండేపూడి శంకరరావు, బొజ్జా రామయ్య, ముమ్మిడి శ్రీను పాల్గొన్నారు. పిఠాపురం నియోజకవర్గ స్థాయి యాదవ కార్తీక వన సమారాధన జోగా వెంకట రమణ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా నలమూలల నుంచి యాదవ సంఘ నాయకులు వచ్చి పాల్గొన్నారు. బీసీవై పార్టీ జిల్లా ఇన్‌చార్జి అనూష యాదవ్,ఈ బిక్కవోలు ఎంపీపీ బుద్దాల కన్నారావు, వైసీపీ నాయకులు అల్లు రాజుబాబు, టీడీపీ నాయకులు రాజనాల రాజుబాబు, గొర్ల మాణిక్యం, ఉర్లంకల వెంకట్, సుబ్రహ్మణ్యం మాష్టార్, ఉపేంద్ర యాదవ్, సీమాంధ్ర యాదవ నాయకులున్నారు.

కోరింగలో...

తాళ్లరేవు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల కార్తీక వనసమారాధనలు జరిగాయి. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. దాట్లను కమ్మసోదరులు సత్కరించారు. కోరింగలో కాకతీయ కమ్మ కార్తీక వనసమారాధన కోడూరి ఆదినారాయణచౌదరి ఆధ్వర్యంలో జరిగింది. పటవల కాశీవిశ్వేశ్వరాలయంలో భక్తులు కార్తీక మాసం పూజలు చేసి కలశాలను వదిలారు.

పెద్దాపురంలో...

పెద్దాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐకృతకు వనసమారాధనలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక బ్యాంక్ కాలనీలో తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు వనసమారాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వనసమారాధనల ద్వారా మానవ సంబంధాలు మరింతగా మెరుగుపడతాయన్నారు. ప్రజలు ఆటపాటలతో విందు భోజనాలు చేశారు. కార్యక్రమంలో జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), తెలగా అభ్యుదయ సంఘం అధ్యక్షుడు పసుపులేటి సాయిబాబు, గౌరవాధ్యక్షుడు తాడి రాజగోపాలరావు, సింగన అరవిందకుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు. అలాగే బ్రాహ్మణ సేవా సంఘం, సూర్య బలిజ సంఘం ఆధ్వర్యంలో ఉత్సాహంగా వనసమారాధనలు నిర్వహించారు.

కాకినాడ రూరల్‌లో...

కాకినాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం అచ్చంపేట సమీపంలోని ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ఎదురుగా గల మామిడి తోటలో కాకతీయ అసోషియేషన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి ఆధ్వర్యంలో కమ్మ మహాజనుల కార్తీక వన సమారాధన నిర్వహించారు. కాకతీయ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.నందకిషోర్, బి.శ్రీనివాస్ వనదేవతకు పూజలు చేసి ప్రారంభించారు. భారతీయం వ్యవస్థాపకురాలు, ప్రముఖ ప్రవచన కర్త గొట్టిపాటి సత్యవాణి, ఏపీ కాకతీయ సేవా సమాఖ్య అధ్యక్షుడు వెలగపూడి గోపాలకృష్ణప్రసాద్, ఎన్ఆర్ఐ ముత్యాల పద్మశ్రీ పాల్గొని కమ్మ మహాజనులంతా ఐక్యంగా ఉండాలన్నారు. జబర్దస్త్ కమెడియన్ శాంతికుమార్, కమెడియన్ గౌతంరాజు, మిమిక్రీ ఆర్టిస్ట్ శ్రీనివాస్ ప్రదర్శనలు అలరించాయి. కమ్మ మహాజనులందరూ వనభోజనాలు చేశారు. పలుక్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులతో పాటూ, లక్కీ డిప్ గెలుచుకున్న సామర్లకోటకు చెందిన మార్ని పద్మావతి చేతులమీదుగా హోండా యాక్టివాను గుణ్ణం చంద్రమౌళి చేతులమీదుగా అందజేశారు. ఏర్పాట్లను కార్యక్రమ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు జానకిరామ్ చౌదరి, శ్రీనివాస్,రాంప్రసాద్ పలువురు పర్యవేక్షించారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ


మహిళలకు సర్టిఫికెట్లు అందించిన ఎమ్మెల్యే పంతం నానాజీ, యార్లగడ్డ సుధారాణి

సర్పవరం జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు వృత్తి నైపుణ్యాలను పెంచుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. ఆదివారం సర్పవరం కార్మికుల సంఘం భవనంలో తదేకం ఫౌండేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ యార్లగడ్డ సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహిళల స్వయం సమృద్ధి, జీవనోపాధి కోసం గత ఐదేళ్లుగా తదేకం ఫౌండేషన్ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. పువ్వుల నుంచి అగర్‌బత్తుల తయారీపై 25 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తదేకం ఫౌండేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుధారాణి కోరారు. పూజా కార్యక్రమాలకు వినియోగించిన పువ్వులు వృధాగా పోతున్నాయని, వీటిని సేకరించి యంత్రాల ద్వారా ప్రోసెసింగ్ చేసి కొవ్వొత్తుల తయారీ చేసి మార్కెటింగ్ చేసి వ్యాపార వేత్తలుగా రాణించాలన్నారు. ఇందుకు శిక్షణ, యంత్రాలు, ప్రభుత్వ సహకారం అందించేందుకు తదేకం సంస్థ సిద్ధంగా ఉందన్నారు. అనంతరం టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జనసేన నాయకులు పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాశ్, కరెడ్ల గోవిందు, తాటికాయల వీరబాబు, మాదారపు తాతాజీ, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, పుల్ల వీరబాబు తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న నిరుపేదల వైద్యం ఖర్చులను ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా రీఎంబెర్స్‌మెంట్ చేస్తున్నట్లు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఆదివారం గొడారిగుంటలో ముగ్గురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.3,87,187 చెక్కులను అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు కరెడ్ల గోవిందు తదితర నాయకులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


పిఠాపురంలో సందడి చేస్తున్న విద్యార్థులు

పిఠాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ఆంధ్రకేసరి ప్రకాశం మున్సిపల్ హైస్కూల్‌లో 1983లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. పిఠాపురం మండలం నరసింగపురం రావుల వారి మామిడి తోటలో సందడిగా గడిపారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి బహుమతులు అందించారు. పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు తోలేటి శ్రీనివాస్, నాళం రవికుమార్, బంగారు రామకృష్ణ, లంకలపల్లి శ్రీను, కొత్త లక్ష్మీనారాయణ, దువ్వా సురేష్ అన్నారు. ఇది 30వ ఆత్మీయ సమ్మేళనమని, మరిన్నిసార్లు కార్యక్రమాలు జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఉప్పాడలో...

కొత్తపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ కొత్తపల్లి వీర్రాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977-78 సంవత్సరంలో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సహపంక్తి భోజనాలు చేశారు.

పూర్వ విద్యార్థుల వితరణ

కాకినాడ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెడ్‌కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినిక ల్యాబ్ ఆవరణలో రూ.1,25,000ల విలువైన స్కాలర్‌షిప్‌లను, పేద మహిళకు రూ.20,000విలువైన వెట్ గ్రైండర్‌ను, గుండెజబ్బుతో బాదపడుతున్న మహిళకు రూ.40,000 విలువైన మందులను పూర్వవిద్యార్థులు అందజేశారు. ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్యం, స్వయం ఉపాధి కల్పనకు రెడ్‌కాన్వెంట్ పూర్వ విద్యార్థులు కృషి చేస్తున్నారన్నారు. ట్రస్ట్ కార్యదర్శి కళ్యాణి, ట్రస్టీ పద్మనాభం పాల్గొన్నారు.

గౌతమ్ అదానీని తక్షణం అరెస్టు చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన

పెద్దాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ పేరుతో అవినీతికి పాల్పడిన గౌతమ్ అదానీని తక్షణం అరెస్టు చేయాలని, అదానీ కంపెనీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మెయిన్ రోడ్డులో ఆందోళన నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక రంగాన్ని దెబ్బతీసిన వ్యక్తిగా అదానీ మారిపోయాడన్నారు. అతనిపై అరెస్టు వారెంట్ జారీచేశారంటే పరిస్థితి ఎంత త్రీవ్రంగా ఉందో అర్థమవుతోందన్నారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు నాటి ప్రభుత్వ పెద్దలకు ముడుపులు ముట్టచెప్పారన్నారు. తక్షణం అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నీలపాల సూరిబాబు, సినిపురపు శ్రీనివాస్, కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి, కృష్ణ, కూనిరెడ్డి అరుణ ఉన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష కార్తీక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సామర్లకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలు ఇరవై మూడవ రోజు పురస్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా తెల్లవారుజామున గోపూజలు నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి,అమ్మవార్లను దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో లక్షపత్రి పూజల్లో కాకినాడకు చెందిన దాసరి పట్టాభి సీతారామస్వామి దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశదీప పూజల్లో పట్టాభి సీతారామస్వామి దంపతులు, పలువురు భక్తులు ఆశీనులయ్యారు. కార్తీకదీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన పూజలు చేపట్టారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు 3,500 మంది భక్తులకు అన్నదానం జరిగింది.

భక్తులకు అల్పాహారం

కాగా ఆదివారం రాత్రి ఆలయానికి విచ్చేసిన భక్తులకు సామర్లకోట లయన్స్ భీమేశ్వరా క్లబ్ సౌజన్యంతో చక్కెర పొంగలి, పులిహోర అల్పాహారం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుమారు 1,000మందికి అల్పాహారం అందజేశారు. ఈ సేవల్లో చిత్తులూరి రాజా, ఈదర ఈశ్వర్ కుమార్, అమలకంటి శ్రీనివాసరావు, గుండు శంకరరావు, మద్దిరాల శివనాగకృష్ణ, మాజేటి కృష్ణ, మేకా శ్రీను, కర్రి ఆదినారాయణ రెడ్డి, కానుబోయిన విజయకృష్ణ పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధికి పాదయాత్ర

గొల్లప్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని కనకదుర్గ ఆలయం నుంచి మహా పాదయాత్ర కమిటీ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా అన్నవరం సత్యదేవుని సన్నిధికి భక్తులు పాదయాత్రగా వెళ్లారు. ఆదివారం ఉదయం 8గంటలకు గొల్లప్రోలు ఈ పాదయాత్ర ప్రారంభమైంది. సుమారు 3వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పండ్లు పంపిణీ చేశారు. భోజనం సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపకులు జ్యోతులు శ్రీనివాస్, మజ్జిగ జ్యోతుల సురేష్, అల్పాహారం మామిడా సూరిబాబు, అక్కిరెడ్డి శ్రీను అందించారు.


గొల్లప్రోలు నుంచి అన్నవరం పాదయాత్ర చేస్తున్న భక్తులు

ప్రజల మేలు కోరే కూటమి ప్రభుత్వం

మంత్రి సుభాష్


మంత్రికి వేంకటేశ్వరస్వామి చిత్రపటం బహూకరిస్తున్న దృశ్యం

తాళ్లరేవు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల మేలు కోరే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సంక్షేమ పథకాలను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం 216 జాతీయ రహదారి పక్కన చినబాపనపల్లి ప్రాంతం ఎల్లమ్మగుడి వద్ద యానాం శెట్టిబలిజ నవయుగ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలపై దౌర్జన్యాలు, దుర్మార్గాలకు పాల్పడి చిత్తుగా ఓడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తుందన్నారు. మంత్రికి శ్రీవేంకటేశ్వరస్వామి పటం బహూకరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు రాయుడు గోవిందు, పితాని శివాజీ పాల్గొన్నారు.

మరిడమ్మకు సారె సమర్పణ


మరిడమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు

పెద్దాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి స్థానిక బస్ స్టాండ్ వద్ద ఉన్న సిద్ధి వినాయక, షిరిడీ సాయి ఆలయం ఆదివారం సారె సమర్పించారు. మహిళా భక్తులు చీర, పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పళ్ల తదితరాలను తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మీ వారికి స్వాగతం పలికారు. ప్రసాదాలను అందజేశారు. దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

పెద్దాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లమూరు గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ సీఈవో ఎస్.అంజనేయులు ఆదివారం తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ కంపెనీయన్‌లో భాగంగా పరిశీలించారు. కచ్చితమైన, తప్పులకు తావులేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

సర్పవరం జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సర్పవరంలో రాష్ట్ర సమాచార హక్కు ప్రసారసాధన సమితి ప్రధాన కార్యదర్శి నిమ్మన సత్యానందం ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ జయంతి కంటి ఆసుపత్రి ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, 50 మందికి కళ్లజోళ్లను ట్రస్ట్ ద్వారా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద పుల్ల శ్రీరాములు, నందా పాండురంగ, పుల్ల శ్రీను, పులగల రాజ్‌కుమార్, ముద్దన సూర్యప్రకాశ్, పుల్ల రాము, పుల్ల వెంకట శేషారావు తదితరులు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో...

కొత్తపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నాగులాపల్లిలో సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కిరణ్ నేత్ర ఆసుపత్రి వైద్యులు 300మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 50మందికి నేత్ర ఆపరేషన్లు అవసరం ఉంటుందని గుర్తించారు. సోమవారం ఆపరేషన్‌లు చేయించుకునేవారిని కిరణ్‌కంటి ఆసుపత్రి పంపిస్తామని తెలిపారు.


నాగులాపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నేడు ఎమ్మెల్యే సత్యప్రభ పర్యటన

రౌతులపూడి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మూలగపూడిలో సోమవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ కోరారు. సర్పంచ్ సత్యనారాయణ చేపటే వనభోజనాలు హాజరై అనంతరం కార్యకర్తలు సమస్యలు తెలుసుకుంటారన్నారు. అనంతరం అన్నవరం వెళ్లనున్నట్టు తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మహాధర్నాను విజయవంతం చేయండి



రంపచోడవరంలో ప్రచారం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

రంపచోడవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రేడ్ యూనియన్ అనుబంధ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీల ఆధ్వర్యంలో ఈనెల26న చేపట్టే దేశవ్యాప్త మహాధర్నాను విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు పిలుపునిచ్చారు. ఆదివారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జోగారావు మాట్లాడుతూ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిసి సీటూ ప్లస్ 50 చట్టబద్ధత ప్రకటించాలని, పోలవరం ప్రాజెక్టు సమస్యలు పరిష్కరించి పునరావాసం కల్పించాలని, ప్రభుత్వ వేతనం రూ26వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచి రోజు వేతనం ఆరు వందలు చేయాలని, అటవీహక్కుల పరిరక్షణ సవరణ చట్టం 2023 ఉపసంహరించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరతూ చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వేట్ల బాబురావు, పొడియం ఇరమరాజు, కొవ్వాసి చిట్టిబాబు, చోడే రామిశెట్టి పాల్గొన్నారు.

వెంకటరెడ్డి ఆలయంలో సామూహిక వ్రతాలు



వ్రతాల్లో పాల్గొన్న జంటలు

ఎటపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) కార్తీక మాసం సందర్భంగా ఆదివారం వెంకట రెడ్డిపేట గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సత్య నారాయణ స్వామి సామూహిక వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. విలీన మండలాలతో పాటు తెలంగాణలోని భద్రా చలం, దుమ్ముగూడెం మండ లాల నుంచి దంపతుల జంటలు తరలివచ్చి సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. వ్రతాల కార్యక్రమం అనంతరం జంటలు కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మాదిరెడ్డి కృష్ణబాబు, మధు గణేష్, మాధిరెడ్డి గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల తాకిడి



పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పొల్లూరులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పొల్లూరు జలపాతం పరిసరాలు కిక్కిరిసాయి. జలపాతం నీటిలో దిగి కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. పిక్నిక్ స్పాట్స్ ధారాలమ్మ గుడి, ఫోర్ బై డ్యాం బ్రిడ్జి పర్యాటకులతో కళకళలాడాయి.

చలికి వణుకుతున్న మన్యం



చలి మంట వేసుకున్న దృశ్యం

మోతుగూడెం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో వారం రోజులుగా చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దీంతో చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. ఎముకలు కొరికే చలితో పర్యాటకులు ఆదివారం మోతుగూడెం అతిథి గృహాల వద్ద చలిమంటలు వేసుకున్నారు.

మహారాష్ట్రలో మహాయుతి విజయంపై తుమ్మలపల్లి హర్షం

జగ్గంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో మహాయుతి విజయంపై జగ్గం పేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి అభ్యర్థులకు మద్దతుగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల్లో ప్రచారం చేశారన్నారు. ఆయన ప్రచారం చేసిన అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారన్నారు. పవన్ మద్దతుతో అన్నింటా విజయం సాధించడంతో 100 శాతం స్ట్రైక్ రేట్ అందుకున్నారన్నారు. విజయం సాధించిన ఎమ్మెల్యేలు సైతం తమ అధినేత పవన్ కల్యాణ్ మద్దతు వల్లే విజయం సాధించారని చెప్పడం గర్వకారణంగా ఉందన్నారు. పవన్ రాష్ట్రంలోనే కాకుండా దేశ రాజకీయాల్లో సైతం కింగ్ మేకర్‌గా నిలుసున్నారని రమేష్ పేర్కొన్నారు. మహాయుతి కూటమికి శుభాకాంక్షలు తెలిపారు. తమ అధినేత పవన్ ఉప ముఖ్యమంత్రి నుంచి అంచలంచెలుగా ఎదిగి రాబోయే కాలంలో ముఖ్యమంత్రి పదవిచేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సత్యదేవుని సన్నిధికి పాదయాత్ర

గొల్లప్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని కనకదుర్గ ఆలయం నుంచి మహా పాదయాత్ర కమిటీ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా అన్నవరం సత్యదేవుని సన్నిధికి భక్తులు పాదయాత్రగా వెళ్లా రు. ఆదివారం ఉదయం 8గంటలకు గొల్లప్రోలు ఈ పాదయాత్ర ప్రారంభ మైంది. సుమారు 3వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పండ్లు పంపిణీ చేశారు. భోజనం సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపకులు జ్యోతులు శ్రీనివాస్, మజ్జిగ జ్యోతుల సురేష్, అల్పాహారం మామిడా సూరిబాబు, అక్కిరెడ్డి శ్రీను అందించారు.


మరిడమ్మకు సారె సమర్పణ

పెద్దాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి స్థానిక బస్‌స్టాండ్ వద్ద ఉన్న సిద్ధి వినాయక, షిరిడీ సాయి ఆలయం ఆదివారం సారె సమర్పించారు. మహిళా భక్తులు చీర, పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పళ్ల తదితరాలను తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశా రు. అనంతరం అమ్మవారికి సమర్పించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మీ వారికి స్వాగతం పలికారు. ప్రసా దాలను అందజేశారు.

టీడీపీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

పిఠాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఆదివారం పిఠాపురం టీడీపీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. రానున్న నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అలాగే టీడీపీ సభ్యత్వాలు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం 15వేలు పూర్తయ్యిందని, మరింత పెంచాలన్నారు. వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ నియమితులైన బర్ల అప్పారావును సత్కరించారు. ఆయన పార్టీకి అందిం చిన సేవలను కొనియాడారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు



గొల్లప్రోలు రూరల్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కాల భైవర అష్టకంతో ప్రత్యేక పూజలు చేపట్టి అనంతరం ఆలయ ఆవరణంలో కార్తీక దీపాలతో కాల భైరవ అలంకారాలు చేశారు. భక్తులతో దత్తు, వీరబాబు సోదరులు ప్రత్యేక పూజలు చేయించారు.

భీమేశ్వరాలయంలో విశేష కార్తీక పూజలు

సామర్లకోట, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంపురస్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు.తొలుత తెల్లవారుజామున గోపూజలు నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి,అమ్మవార్లను దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో లక్షపత్రి పూజల్లో కాకినాడకు చెందిన దాసరి పట్టాభి సీతారామస్వామి దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వ హించారు.

కోలాహలంగా వన సమారాధనలు



జగ్గంపేటలో వన సమారాధనలో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్, కత్తిపూడిలో విజేతలకు బహుమతులు, కిర్లంపూడిలో బహుమతుల అందజేత

జగ్గంపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక గుర్రంపాలెం రోడ్‌లో గల పామాయిల్ తోటలో ఆదివారం తూర్పు కాపు వన సమారాధన ఘనంగా నిర్వహించారు. తూర్పు కాపు కుటుంబాలు విచ్చేసి క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలు, పెద్దలు, ఆటపాటలతో సరదగా గడిపారు. కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నెహ్రూను తూర్పు కాపుసంఘం పెద్దలు గజమాలతో సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముది నారాయణస్వామి, మజ్జి పద్మావతి, గెడ్డం పెద్ద కాపు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ మండలాధ్యక్షులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, వేములకొండ జోగారావు, జగ్గంపేట తూర్పు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు పిలా మహేష్, అధ్యక్షుడు తాండ్రోతు నూకరాజు, సెక్రటరీ కరు ముజ్జి రామకృష్ణ, ట్రెజరర్ ప్రేమ స్వరూప్‌బుజ్జి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ వన సమారాధనకు జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. శాలువా, పూలమాలతో సత్కరించారు.

గోకవరం రోడ్డులో గల అల్లూరి సీతారామరాజు క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో జగ్గంపేట ఏరియా క్షత్రియుల వన మహోత్సవం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హాజరయ్యారు. వారిని క్షత్రియ పరిషత్ నాయకులు ఘనంగా సత్కరించి అల్లూరి సీతారామరాజు విగ్రహాలను జ్ఞాపికగా అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు పాల్గొన్నారు. గుర్రప్పాలెం రోడ్డులో మాజీ సర్పంచ్ తోట గంటి గోవింద్ పామాయిల్ తోటలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక సమారాధన నిర్వహించారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో తూర్పు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్తీక వన సమారాధనలో పెద్ద ఎత్తున ఆ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు. ధర్మవరం, రాచపల్లి అడ్డురోడ్డు, ఎకరంపాలెం, తోటపల్లి, ఒమ్మంగి, ధారపల్లి గ్రామాల్లో కార్తీక వన సమారాధనలు జరిగాయి.

కత్తిపూడిలో...

శంఖవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడిలో శివార్లలో శ్రీవాసవి సత్యదేవ ఆర్యవైశ్య సంక్షేమసంఘం సభ్యుల ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. గ్రామస్తులు, బాటసారులు హాజరై వన భోజనాన్ని స్వీకరించారు.

కిర్లంపూడిలో...

కిర్లంపూడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గానుగుల శ్రీనివాసరావు, సెక్రటరీ కొత్తల వీరప్రసాద్ అధ్యక్షతన వనసమారాధన నిర్వహించారు. మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా కవి కింతాడ సన్యాసిరావు, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం విచ్చేశారు. తొలుతగా ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం కోలాట ప్రదర్శనతో అలరించారు. కింతాడ సన్యాసిరావు ను విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులంతా సత్కరించారు. దివిలి సుబ్రహ్మణ్యం, అచ్చారావు, శలపాక శివప్రసాద్, నీలకంఠ రమణ, నాగాచార్యులు పాల్గొన్నారు.

తునిలో...

తునిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తునికి చెందిన యాదవసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెంటకోట రోడ్డులో వన సమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా టీడీపీ నేత యనమల రాజేష్ హాజరయ్యారు. కొయ్యా కేసవ, కుండల రామకృష్ణ, అల్లు రాజు, గిరి, అప్పలరాజు, కాలిబోయిన కృష్ణ, మామిడిదాసు తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడులో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానటుడు దివంగత నందమూరి తారక రామారావు సినీ వజ్రోత్సవ వేడుకలు ఆదివారం నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద పాక సుబ్బు, ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరామ్ వర్మ, ప్రత్తిపాడు అధ్యక్షుడు అడపా జగదీష్, కాకినాడ అధ్యక్షుడు బత్తుల సూర్యప్రసాద్, ఉపాధ్యక్షుడు కర్రి వీరబాబు, ఎన్టీఆర్ అభిమానులు స్థానిక ఆసుపత్రి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ నటించిన తొలి చిత్రం మనదేశం విడుదలై నేటికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అడపా జగదీష్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు సుబ్బు, సాయిరామ్, వర్మ, జగదీష్‌ను భారీ గజమాలతో సత్కరించారు. పేద మహిళలకు 5కిలోల బియ్యం మూటలను సాయిరాం వర్మ, బి.శ్రీనివాసరావు, గూడెం అప్పారావు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాయకంపల్లి సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న యల్లమిల్లి గ్రామానికి సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు జగ్గంపేట ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు తెలిపారు. యల్లమిల్లిలో కొత్త విద్యుత్ లైన్ వేయడం వల్ల సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు.

ప్రైవేట్ కళాశాల బస్సును ఢీకొన్న కారు

గండేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లేపల్లి పాతూరు సెంటర్‌లో రాజమండ్రి వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్తున్న ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా వెనుక వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. స్థానికుల వివరాల ప్రకారం... ఆ కారులో గంగి వీరపండు, వీరాఘవమ్మ దంపతులు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. వారికి ఒక చిన్నారి శ్రీహరికి స్వల్ప గాయాలయ్యాయి. దివాన్ చెరువు నుంచి అన్నవరం దగ్గర ఉన్న తమ్మయ్యపేట వెళ్తుండగా మల్లేపల్లి వచ్చేసరికి ఈప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం వల్ల బస్సు కారు రోడ్డుకు అడ్డుగా ఉండిపోవడంతో సుమారు కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.



మల్లేపల్లి జాతీయ రహదారిపై ప్రైవేట్ కళాశాల బస్సును ఢీకొన్న కారు

లోవ క్షేత్రంలో భక్తుల కోలాహలం




భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ, ఆరుబయట వంటావార్పు చేసుకుంటున్న భక్తులు

తుని రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేకువజామునే లోవకు తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. క్యూలలో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు.భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాధ్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

చైతన్య గ్రామీణ బ్యాంకు చైర్మన్ పూజలు

లోవ దేవస్థానంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డిపూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో పూజల్లో పాల్గొన్న ఆయనకు ఆలయ పండితులు వేద ఆశీర్వచనాలు అందజేసి అమ్మవారి ప్రసాదాలు అందించారు. బ్యాంక్ డివిజన్ మేనేజర్ పి.పాపయ్య స్థానికశాఖల మేనేజర్లు, సిబ్బంది ఉన్నారు.

గోవింద రెడ్డి పాదయాత్రకు జగ్గంపేటలో స్వాగతం



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల నుంచి బయటకు వచ్చి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే విశాఖపట్నం నుంచి భద్రాచలం శ్రీరాముల వారి చెంతకు పాదయాత్రగా వస్తానని మొక్కుకున్న విశాఖపట్నం 69వ కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి మొక్కులు చెల్లించే కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేసుకుంటూ ఆదివారం మధ్యాహ్నం జగ్గంపేటకు చేరుకున్నారు. జగ్గంపేటలో ఆయనకు టీటీడీ పాలక మండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘనస్వాగతం పలికి సత్కరించారు. కాకినాడ జిల్లా భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షుడు, రుచి హోటల్స్ అధినేత పాలచర్ల నాగేంద్ర చౌదరి గోవింద్‌రెడ్డిని సత్కరించి మోహన్ సాయికృష్ణ రెసిడెన్సీలో వసతి, భోజనం ఏర్పాటు చేశారు. గోవిందరెడ్డి మాట్లాడుతూ నాకు ఇంతటి స్వాగతాన్ని ఇచ్చి సత్కరించిన నెహ్రూకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, బద్ది సురేష్, వేములకొండ జోగారావు, మండపాక అప్పన్నదొర, ఏవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు



గండేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో నీలాద్రిరావుపేటలో జాతీయ రహదారిపై ఆదివారం అన్నవరం నుంచి నందిగామ వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ కారులో నలుగురు ఉన్నారు. అయితే ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

పోతులూరులో లిబరేషన్ ప్రదర్శన

ప్రత్తిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులూరు గ్రామంలో ఆదివారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగారాజు మాట్లాడుతూ పేదప్రజల సాగు చేసుకుంటున్న భూములకు హక్కుపత్రాలు మంజూరు చేయాలని, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 4న విజయవాడలో జరిగే ప్రజా హక్కుల ర్యాలీ సభను విజయవంతం చేయాలని జిల్లా లిబరేషన్ నాయకుడు మానుకొండ లచ్చబాబు కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున లిబరేషన్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలు

కుంకుమ పూజలు



జగ్గంపేటలో పూజల్లో పాల్గొన్న మహిళలు

జగ్గంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని జగ్గంపేటలో శ్రీరామ్‌నగర్ రామాలయం వద్ద ఆదివారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సురేష్‌శర్మ మాట్లాడుతూ ప్రతి ఏటా రామాలయం వద్ద కార్తీక మాసం ప్రారంభం నుంచి 12రకాల నదిలో జలాలతో శివపార్వతులకు అభిషేకం నిర్వహించి మట్టి పుట్టతో శివలింగం తయారుచేసి రోజు పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ విధంగా పూజలు చేయడం వల్ల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖంగా ఉంటారని తెలిపారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా హరిబాబు

రౌతులపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యుటీఎఫ్ రౌతులపూడి మండల నూతన అధ్యక్షుడిగా కోరుప్రోలు హరిబాబు ఎన్నికయ్యారు. ఆదివారం బలరామపురం గ్రామ శివారు కోళ్ల రాంబాబు మామిడితోటలో యూటీఎఫ్ మహాసభ, కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, ఎన్నికల అధారిటీ సత్తిబాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కోరుప్రోలు హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా అచ్చిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

కోటనందూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలకు భద్రతపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్ఐ టి.రామకృష్ణ అన్నారు. ఆదివారం సంఘవాక గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళలు ఫొక్సో వంటి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గిరిజన గ్రామమైన సంఘవాకలో ప్రత్యేకంగా మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

4న ప్రజా హక్కుల సభ

రౌతులపూడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 4న విజయవాడలో జరిగే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారాజు పిలుపునిచ్చారు. రౌతులపూడిలో కార్యకర్తలతో ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. అధికసంఖ్యలో ప్రజల హాజరై విజయవాడ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు మాత్రమే కాదు పీపుల్స్ సిక్స్ అమలు చేయాలని, పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

రౌతులపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌పట్నం గ్రామంలో మేము సైతం సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తుని మమతా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ప్రత్యూష, అశోక్ వైద్యసేవలందించారు. 250 మందికి షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేము సైతం సంక్షేమ సంఘం సభ్యులు జి.వీరబాబు, వి.బాలకృష్ణ, కే. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధి పరీక్షలు

ఏలేశ్వరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దివంగత డాక్టర్ షణ్ముఖ రావుహాస్పటల్ నందు ఉచిత షుగర్ వ్యాధి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కాకినాడకు చెందిన ప్రముఖ షుగర్‌వ్యాధి నిపుణుడు విజయ్‌కుమార్ 100 మంది రోగులకు రక్తపరీక్షలు చేసి మందులు అందజేశారు. లయన్స్ అలమండదుర్గా వెంకటప్రసాద్, తూము రౌతు గురయ్యలయన్స్ పూరురాజబాబు, ఉడతల రమణారావు, లయన్స్ కోట శ్రీనివాసరావు, చక్రవర్తి పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం